క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనాలు అందించాలి



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందించాలని ఎంఈఓ ఎం.వి.ప్రసాద రావు వంట నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను శనివారం ఆయన పరిశీ లించారు. వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచి, శుచికరమైన భోజనాలు అందించాలన్నారు. అంతకుముందు విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆయన వెంట హెచ్ఎం జి.స్రవంతి ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

వంగర: మొక్కల తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని బాగెంపేట ప్రభుత్వ పాఠ శాల హెచ్ఎం ఎం.వి.రమణ అన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులతో కలిసి శనివారం పలురకాల మొక్కలను నాటారు.

పొదుపు సంఘాల లావాదేవీలపై ఆడిట్



వెలుగు కార్యాలయంలో ఆడిటింగ్ చేస్తున్న సిబ్బంది

బొబ్బిలిరూరల్: డ్వాక్రా సంఘాలకు అందించిన బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఇతర రుణాలపై వెలుగు సిబ్బంది అంతర్గత ఆడిట్ నిర్వహిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని పలు గ్రామాలకు చెందిన సంఘాల లావాదేవీలు, రుణాలు, ఖర్చులపై స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఆడిట్ నిర్వహించారు. సంఘాలకు అందిన రుణాలు, బ్యాంకులకు చెల్లించిన రుణాల మొత్తాన్ని సీసీలు,వీఓఏలు గణన చేస్తున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణ

రేగిడి: పనసలవలస గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) ఈఓపీఆర్డీ ఏ.వి.సత్యనా రాయణ శనివారం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. రోజూ గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ గోవిందరావు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి గౌతమి ఉన్నారు.

ఉంచుతారా.. తొలగిస్తారా?



రాజుపేటలో కొత్తగా నిర్మిస్తున్న కాలువ మధ్యలో మంచినీటి బోరు

బొబ్బిలి రూరల్: పై చిత్రంలో కొత్తగా నిర్మిస్తున్న కాలువకు అడ్డంగా ఉన్న బోరును చూశారా... ఇది బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి రాజుపేటలోనిది. రూ.10 లక్షల వ్యయంతో కాలువలు, సీసీ రోడ్డు పనులు తలపెట్టారు. వీధి విస్తరణ చేపట్టడంతో ఓ ఇంటి యజమాని వేసిన బోరు కాలువలోకి వచ్చింది. దీనిపై అభ్యంతరం తెలపడంతో కాలువ నిర్మాణం గత పది రోజులుగా నిలిచిపోయింది. ఇంటి యజమానిని ఒప్పించి బోరు తొలగిస్తారా..? లేదంటే కాలువ నిర్మాణాన్ని ఆపేస్తారా అన్న చర్చ గ్రామస్తుల్లో సాగుతోంది. దీనిపై స్థానిక సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తే అది బోరు, ఇది డ్రైనేజీ అంతే.. ఇందులో చెప్పేందుకు ఏమీలేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ కుటుంబానికి తాగునీటినిచ్చే బోరుకు సమాంతరంగా కాలువ నిర్మాణంపై గ్రామస్తులు ముక్కునవేలేసుకుంటున్నారు.

పీఎంశ్రీ పథకం అమలులో నిర్లక్ష్యం

- పథకానికి ఎంపికైన పాఠశాలల్లో కానరాని ప్రగతి
- నిధుల విడుదల్లో జాప్యం, పనుల్లో అలసత్వం
- రాజాం నియోజకవర్గంలో రెండు విడతల్లో ఏడు పాఠశాలలు ఎంపిక
- ఒక్క పాఠశాలలో మాత్రమే నిధుల వినియోగం



అభివృద్ధికి నోచుకోని రేగిడి మండలంలోని లక్ష్మీపురం ఉన్నత పాఠశాల మైదానం

రాజాం నియోజకవర్గంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు

మండలం	పాఠశాలల వివరాలు
రాజాం	కంచరాం, డోలపేట ఉన్నత పాఠశాలలు
వంగర	మడ్డువలస రెసిడెన్షియల్ స్కూల్
రేగిడి	లక్ష్మీపురం, ఏ.వి.పురం ఉన్నత పాఠశాలలు
సంతకవిటి	మందరాడ, సిరిపురం ఉన్నత పాఠశాలలు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు వాటిని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని 2022 సెప్టెంబర్ నెలలో ప్రారంభించింది. ఈ పథకం కింద 2023–24 విద్యాసంవత్సరానికి దేశ వ్యాప్తంగా 14,500 పాఠశాలలను ఎంపిక చేయగా రాష్ట్రంలో 855 పాఠశాలలకు చోటు కల్పించారు. రాష్ట్రంలో తొలివిడతగా ప్రతీ జిల్లాలో 10 ఉన్నత పాఠశాలలు, రెండో విడతలో మరో పది పాఠశాలలను ఎంపిక చేశారు. రాజాం నియోజకవర్గంలో తొలివిడతో నాలుగు ఉన్నత పాఠశాలలు, రెండో విడతలో మూడు ఉన్నత పాఠశాలలు ఎంపిక య్యాయి. ఒక్కో పాఠశాలకు ఆయా పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీస నిధి రూ. 2.50 లక్షల నుంచి అత్యధికంగా రూ. 24 లక్షల వరకు కేటాయించారు. ఈ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మైదానాల నిర్మాణం, విద్యార్థులకు వినోద, విహార యాత్రలకు తీసుకువెళ్లడం, కిచెన్ గార్డెన్‌ల నిర్వహణ వంటివి చేయాల్సి ఉంది. అయితే నియోజకవర్గంలో ఈ పథకం అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. అధికారుల అలసత్వంతో పాటు విద్యా శాఖ పర్యవేక్షణాలోపం ఈ పథకం అమలుకు శాపంగా మారింది. పలుచోట్ల నిధులు దుర్వినియోగమవుతుండగా, మరికొన్ని చోట్ల నిధులు విడుదల్లో జా ప్యం, పనుల నిర్వహణలో అలసత్వం వల్ల లక్ష్యం నీరుగారుతోంది. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు–నేడు నిధులతో పాఠశాలల్లో చేసిన అభివృద్ధి పనులే తప్ప, పీఎంశ్రీ ద్వారా చేసిన పనులు కానరావడం లేదు.పీఎంశ్రీకి ఎంపికైన ఈ ఏడు ఉన్నత పాఠశాలల్లో గతేడాదిగా మైదానాలు, ఇతర అభివృద్ధి పనులు ఏమీ జరుగలేదు. రాజాం మండలంలోని ఒక్క కంచరాం ఉన్నత పాఠశాలలో మినహా మిగిలిన చోట పనులు చేపట్టకపోవడంతో పీఎంశ్రీ లక్ష్యం గాలిలో దీపంలా మారింది.

నిధుల దుర్వినియోగం..!

పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల వినియోగంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎక్కువ చొరవ చూపాల్సి ఉంది. రాజాం మండలం కంచరాం ఉన్నత పాఠశాలలో ఈనిధుల వినియోగం సక్రమంగా కనిపించగా, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో వీటి వినియోగంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. సంతకవిటి మండలం మందరాడ, వంగర మండలం మడ్డువలస స్కూళ్లలో ఈ పథకం నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పీఎం శ్రీ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు పాఠశాలల్లో వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతు న్నారు.

హెచ్ఎంలదే బాధ్యత



పీఎం శ్రీ పథకం చాలా విలువైనదని. ఈ పథకాన్ని చాలా చక్కగా వినియోగించుకోవాలి. ఈ పథకానికి రాజాం మండలంలో రెండు పాఠశాలలు ఎంపిక కాగా, ఒక పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. ఇంకో పాఠశాలకు మైదానం లేదు. మిగిలిన మండలాల్లో కూడా వీటిని సద్వినియోగంచేసుకోవాలి. నిధులు వినియోగపు బాధ్యత, అర్హత ఆయా పాఠశాలల హెచ్ఎంల పరిధిలో మాత్రమే ఉంది.

– యాగాటి దుర్గారావు, ఎంఈఓ, రాజాం



సంతకవిటి మండలంలోని మందరాడ ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన మైదాన అభివృద్ధి పనులు



అభివృద్ధికి నోచుకోని వంగర మండలంలోని మడ్డువలస రెసిడెన్సియల్ స్కూల్ ప్రాంగణం, మైదానం



రాజాం మండలం కంచరాం హైస్కూల్ మైదానంలో పీఎంశ్రీ నిధులతో చేసిన పనులు

మచ్చిక చేసుకో కానీ.. మాటలు మీరొద్దు

- బుచ్చయ్య చౌదరి వ్యాఖ్యలపై శంబంగి సీరియస్



మాట్లాడుతున్న శంబంగి

బొబ్బిలి: మంత్రి పదవి కోసమో, మరే పదవి కోసమో చంద్రబాబు,లోకేష్‌లను మచ్చిక చేసుకోవాలంటే చేసుకో కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు అనుచితమన్నారు. బుచ్చయ్య చౌదరికి వయసు పెరిగే కొద్దీ బుద్ధి తగ్గిపోతున్నట్టుందన్నారు. పెద్ద వయసు వచ్చాక హుందాగా వ్యవహరించాల్సింది పోయి తల నరుకుతాం, బతకనీయం వంటి వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సబబో తెలుసుకోవాలన్నారు. కనీసం బుచ్చయ్య చౌద రి వ్యాఖ్యలను ఆ పార్టీ అధిష్టానం ఖండించడం లేదన్నారు. జగన్‌కు జనాదరణ ఉంది కాబట్టే ఆయన ఎక్కడకు వెళ్లినా జనం పెద్ద ఎత్తున తరలి వస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, అరాచక పాలన సాగిస్తుండడం వల్ల కూటమి ప్రభుత్వాన్ని జనం చీదరించుకుంటున్న విషయం గుర్తెరగా లన్నారు. వెంటనే జగన్ మోహన్ రెడ్డికి బుచ్చయ్య చౌదరి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కొండచిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువ

తెర్లాం: మండలంలోని రంగప్పవలస గ్రామంలోని కోనేరు గట్టుపై సంచరిస్తున్న సుమారు ఎనిమిది అడుగుల పొడవున్న కొండచిలువను గ్రామస్తులు శనివారం హతం చేశారు. కోనేరు గట్టుపై కొబ్బరి మొక్కలకు నీళ్లు పోస్తున్న కూలీలకు కొండచిలువ తారసపడింది. ఇదే విషయాన్ని వారు స్థానికులకు తెలియజేయడంతో వారు వచ్చి కర్రలతో కొండచిలువను కొట్టి చంపేశారు.

తాగునీటిని వృథా చేయొద్దు



రేగిడిలో ర్యాలీ చేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, అధికారులు

రేగిడి: రక్షిత మంచి నీటి పథకాల నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని వృథా చేయొద్దని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ శ్యామలాకుమారి ప్రజలకు సూచించారు. నీరు –మీరు కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో ప్రజలకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సంరక్షణ బాధ్యతను ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకోవాలన్నారు. కుళాయిల ద్వారా తాగునీటి వృథాను అరికట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ సీహెచ్ పద్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ హరనాథ్ ఏపీఎం గోవిందరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తే పుట్టగతులుండవు

- 'యువత పోరు' ధర్నా కరపత్రాల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: యువత పోరు ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శంబంగి, యువజన విభాగం నాయకులు

బొబ్బిలి: పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసినట్టు యువత, నిరుద్యోగులను కూడా మోసం చేస్తే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు యువత, నిరుద్యోగులకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు, రూ.3వేల నిరుద్యోగ భృతి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'యువత పోరు' కరపత్రాలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా చంద్రబాబు అండ్–కో ఎన్నికలకు ముందు అనేక హామీలను గుప్పించి, ఇప్పుడు వాటిని అమలు చేయడానికి వెనుకాడు తున్నారన్నారు. ఇటువంటి మోసకారి మాటలు చంద్రబాబునాయుడుకు అలవాటే అయినా యువతను సైతం మోసం చేయడం సరికాదన్నారు.నిరుద్యోగ భృతిని బేషరతుగా అమలు చేయాలని, అనంతరం 20 లక్షల ఉద్యోగాలను, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాల న్నారు. వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గం నుంచి యువత, నిరుద్యోగులు కలెక్టరేట్ వద్ద 23న ఉదయం 10.30 గంటలకు నిర్వహించే యువత పోరు ధర్నా, నిరసన కార్యక్రమనికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, బాడంగి మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు తమ్మిరెడ్డి దామోదరరావు, మరిపి శంకరరావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, బాడంగి ఎంపీపీ ప్రతినిధి కండి సురేష్,బాడంగి మండల యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, గొల్లాది మాజీ ఎంపీటీసీ సభ్యుడు స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

బాడంగి: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం 'యువత పోరు' పేరిట ధర్నా నిర్వహించనున్నామని బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు బొబ్బిలి నియోజకవర్గం నుంచి విద్యార్థులు,యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. చంద్రబాబుఉ ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీతో పాటు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలకు ఎగనామం పెట్టారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా విడుదల చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో అంతా పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీద్దామని పేర్కొన్నారు.

ప్రధాని మెప్పు కాదు..కార్మికుల మెప్పు పొందాలి



వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రధానమంత్రి మెప్పుకోసం యోగా దినోత్సవాన్ని నిర్వహించడం గొప్ప కాదని,46 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీ రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి మెప్పు పొందాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజాం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు రాజాం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 14వేల మంది కార్మికులు తమకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కొద్దిరోజులుగా పోరాటం చేస్తుంటే ..కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు ఆర్థిక ఇబ్బం దులున్నాయని చెబుతున్న ప్రభుత్వం..... గిన్నిస్ బుక్ రికార్డు కోసం మాత్రం ప్రజాధనాన్ని వృథా చేసి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కార్మికులు నిరవధిక సమ్మె చేయనున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు హరిబాబు, అనీల్, మరియదాసు, కృష్ణ, గణపతి, రామకృష్ణ, ప్రసన్నలక్ష్మి, శారద, లక్ష్మి, సత్యనారాయణ, సోమేష్, తదితరులు పాల్గొన్నారు. – రాజాం సిటీ

నిర్లక్ష్యానికి నిదర్శనం



రాజాం పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ప్రధాన రహదారి మధ్యలో ఉన్న గొయ్యి ప్రమాదకరంగా మారింది. తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకులను సరిచేసేందుకు సంబంధిత సిబ్బంది గొయ్యి తవ్వి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రాంతంలో ఇలా నిర్లక్ష్యంగా గొయ్యిని పూడ్చకుండా వదిలేసిన అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు.వాహనచోదకులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఆ గొయ్యిలో స్థానికులు తాత్కాలికంగా రేడియం పోల్‌ను ఏర్పాటు చేశారు. – రాజాం సిటీ

కుంగిన రోడ్డు



బొబ్బిలి మండలంలోని పారాది గ్రామ బ్రిడ్జి సమీపంలో రోడ్డు శనివారం కుంగిపోయింది. దాదాపు 3 అడుగుల లోతున రోడ్డు కుంగిపోయింది. ఇది రామభద్రపురం నుంచి రాయగడ వెళ్లే జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు కుంగడం వల్ల ఏర్పడిన గోతుల్లో వాహనాలు పడిపోయే ప్రమాదం ఉంది. కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జికి కూతవేటు దూరంలో రహదారి కుంగిపోవడంతో ఈమార్గంలో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. అర్అండ్‌బీ, పోలీసులు సంయుక్తంగా ఈ మార్గంలో భారీ వాహనాలను నియంత్రికుంటే రోడ్డు మొత్తం కుంగిపోవడమే కాకుండా ప్రమాదాలు జరిగే జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు స్పందించి త్వరగా మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు. – బొబ్బిలి రూరల్

యోగాతో శారీరక,మానసిక ప్రశాంతత



రాజాం సిటీ: జీఎంఆర్ ఐటీలో యోగా చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు



బొబ్బిలిరూరల్: పిరిడి ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయ ఆవరణ ఆసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, తదితరులు

నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. కొన్ని చోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు, యోగా సంస్థలు ఉచిత యోగా తరగతులు నిర్వహించి, యోగా గొప్పతనాన్ని ప్రజలకు వివరించాయి. – సాక్షి నెట్‌వర్క్



రేగిడి : యోగా దే అక్షర ఆకారంలో ఏ.వి.పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు



బొబ్బిలి: బొబ్బిలి కోర్టులో యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



బొబ్బిలి: బొబ్బిలిలోని రాజుల గెస్ట్ హౌస్‌లో యోగా చేస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు,సిబ్బంది



బాడంగి: మండల కేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో యోగా చేస్తున్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు